

3వ నివేదిక

జూలై 18, 2026

# పరలోకంలో కుదర్చబడిన జంట

## ఆల్బర్ట్ మరియు లిజియా - స్పెయిన్

**సబ్బాతు బడి సూపరింటెండెంట్‌కు:** ఈ వారం మిషన్ కథను చెప్పడానికి ఇద్దరిని---ఒక పురుషుడిని మరియు ఒక స్త్రీని---కోరండి. 40 ఏళ్ల ఆల్బర్ట్ మరియు 39 ఏళ్ల లిజియా అనుభవాలను వారు ఒకరి తరువాత ఒకరు వివరించవచ్చు.

**లిజియా:** నేను వెనిజులాలోని ఒక సెవెంత్-డే ఎడ్వెంటిస్ట్ కుటుంబంలో జన్మించాను మరియు దేవుని గురించిన బోధనలు, అనుభవాలతో పెరిగాను. కానీ నాకు 22 ఏళ్ళ వయసులో, నేను చర్చిని విడిచిపెట్టి, మోడలింగ్ మరియు ఫ్యాషన్ ప్రపంచంలోకి ప్రవేశించాను. సంవత్సరాల తరబడి, నేను మిస్ వెనిజులా, మిస్ హవాయియన్ ట్రాపిక్, మరియు మిస్ హిస్పానో వంటి అందాల పోటీలలో మోడలింగ్ చేశాను.

నేను టెలివిజన్లో, సినిమాలలో, మరియు నాటకరంగంలో పనిచేశాను. నేను మ్యాగజైన్లు మరియు ఫ్యాషన్ కేటలాగ్‌లలో కనిపించాను. నాకు సొంత వ్యాపారాలు ఉండేవి. నా జీవితం బయటకు పరిపూర్ణంగా కనిపించినా, లోపల మాత్రం శూన్యంగా భావించేదాన్ని.

**ఆల్బర్ట్:** నేను స్పెయిన్లోని బార్సిలోనాకు సుమారు 75 మైళ్ల (120 కి.మీ.) దూరంలో ఉన్న ఒక చిన్న నగరంలో పెరిగాను. మా కుటుంబానికి కొంత మతపరమైన నేపథ్యం ఉంది,కానీ విశ్వాసం మా అనుదిన జీవితంలో ప్రధాన భాగం కాకపోవడం వల్ల, నేను దేవుని ఉనికి ఉందో లేదో మనకు తెలియదని భావించే (అజ్ఞేయవాద) వాతావరణంలో పెరిగాను. నాకు జీవితం మరియు మరణం గురించి ఎప్పుడూ లోతైన ప్రశ్నలు ఉండేవి. నేను వివిధ ప్రపంచ మతాలలో సమాధానాల కోసం వెతికాను, కానీ నేను ఆకాంక్షించిన సత్యం బైబిల్లో దొరుకుతుందని నేను ఎప్పుడూ ఊహించలేదు.

నాకు వాస్తుశిల్పం, సంస్కృతి, ప్రయాణం, ప్రపంచాన్నిఅన్వేషించడం, లేదా కొత్త విషయాలను కనుగొనడానికి ప్రయత్నించడం మరియు చరిత్ర అంటే చాలా ఇష్టం. కానీ నా జీవితం పార్టీలు మరియు నాకు అసంతృప్తిని కలిగించిన అర్థరహితమైన సంబంధాలతో నిండిపోయింది.

**లిజియా:** నేను కూడా ప్రపంచమంతా తిరిగాను. నేను దేవునికి దూరంగా ఉన్నప్పటికీ, నా హృదయంలో లోతుగా, నేను ఈ సినీ ప్రపంచానికి చెందినదానను కాదనిపించింది.

దేవుడు నన్ను కాపాడుతున్నాడని నాకు తెలుసు, కానీ ఆయన వద్దకు తిరిగి వెళ్లడం అసాధ్యమని నేను అనుకున్నాను. నా వారాంతాలు కార్యక్రమాలతో నిండిపోయేవి, మరియు నా జీవనశైలి దేవుడు నా కోసం కోరుకున్న దానికి చాలా దూరంగా ఉండేది.

ముఖ్యంగా బాధాకరమైన మరియు , విఫలమైన అనేక సంబంధాల తర్వాత, నేను ఒక తీవ్రమైన నిర్ణయం తీసుకున్నాను. నేను నా వృత్తిని వదిలేశాను. నా వ్యాపారాలతో సహా అన్నింటినీ వదిలేశాను. నా గుర్తింపు సినీ ప్రపంచంలో పాతుకుపోయింది, ఇప్పుడు నేను ఎవరో నాకే తెలియకుండా పోయింది. ఆ సమయంలో నేను స్పెయిన్లో నివసిస్తున్నాను. నేను చాలా విచారపడి, స్వంతంగా పుస్తకాల సహాయం తో సమాధానాల కోసం వెతకడం ప్రారంభించాను. ఆ క్రమంలో, నాకు కాబోయే భర్త కోసం నేను రాజీపడలేని కొన్ని విషయాల జాబితాను తయారుచేశాను.

ఆ జాబితాలోని మొదటి అంశం ఏమిటంటే, అతను దేవుడిని నమ్మాలి.

**ఆల్బర్ట్:** సంవత్సరాల తరబడి పార్టీలు చేసుకుంటూ, తప్పుస్థలంలో సమాధానాల కోసం వెతుకుతూ నేను పూర్తిగా కుంగిపోయాను. నా జీవితానికి ఒక కొత్త అర్థం కావాలనిపించింది. నేను తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాను. నా హృదయం ఒక కొత్తదాని కోసం సిద్ధంగా ఉంది. సరిగ్గా అప్పుడే మా దారులు కలిశాయి. మేము కలిసినప్పుడు, మా మధ్య వెంటనే ఒక బంధం ఏర్పడింది. మా ఆశ్చర్యానికి, మా సంభాషణలు సహజంగానే విశ్వాసం చుట్టూ తిరగడం మొదలుపెట్టాయి.

**లిజియా:** మేము రెండవసారి కలుసుకున్నప్పుడు, నేను స్పెయిన్కు చెందిన ఒక ప్రసిద్ధ సెవెంత్–డే ఎడ్వెంటిస్ట్ గాయకుడి సంగీతాన్ని పంచుకున్నాను. నేను అంతకుముందు ఎవరితోనూ అలా చేయలేదు. ఆల్బర్ట్ మొదట దిగ్భ్రాంతికి, ఆశ్చర్యానికి గురయ్యాడు, కానీ దాని గురించి ఏమీ అనలేదు.

మా సంభాషణలు మరింత గాఢంగా సాగాయి. ఆల్బర్ట్ దేవుణ్ణి కనుగొనడం ప్రారంభించాడు, మరియు నేను మతపరమైన సంప్రదాయం ద్వారా కాకుండా అనుభవం ద్వారా దేవుణ్ణి తిరిగి కనుగొనడం ప్రారంభించాను.

**ఆల్బర్ట్:** దేవుడు మమ్మల్ని ఆ స్థితికి ఎలా నడిపించాడో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ.. మేము మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ, ఏడుస్తూ,రాత్రులను గడిపాము. అది లిజియాకు, ఇంటికి తిరిగి వచ్చినట్లు అనిపించింది. అది నాకు, నేను ఎన్నడూ సాధ్యం అనుకోని ఒక కొత్త వాస్తవికతకు నాంది అనిపించింది. బైబిల్లోని దేవుణ్ణి కనుగొనడం పిచ్చిగా అనిపించింది. కానీ తరువాత అది నేను కనుగొన్న అత్యంత అందమైన సత్యం అని తేలింది.

**లిజియా:** మా మధ్య నున్న సంబంధం కేవలం మా ఇద్దరి మధ్య మాత్రమే కాదని మేము గ్రహించాము. అది ముగ్గురి మధ్య ఉంది: ఆల్బర్ట్, నేను, మరియు దేవుడు. మొదటి

నుండి, దేవుడే కేంద్రంగా ఉండి, ప్రతి అడుగునూ నడిపించాడు. మా పట్ల ఆయనకు ఒక ఉద్దేశం ఉందని మేము గ్రహించినప్పుడు, మేము నిశ్చితార్థం చేసుకోవాలని నిర్ణయించుకున్నాము.

**ఆల్బర్ట్:** మేము బాప్తిస్మం తీసుకున్నాము, ఆ తర్వాత వివాహం చేసుకున్నాము. అప్పటి వరకు మేము అనుభవించినవన్నీ యాదృచ్ఛికంగా జరగలేదని మేము గ్రహించాము.

మా గత జీవితంలో ప్రతిదీ మమ్మల్ని శూన్యంగా భావించేలా చేసింది, కానీ ఇప్పుడు మా జీవితాలను దేవుడు తన ప్రేమతో నింపుతున్నాడు. లోకసంబంధమైన విజయం, విందులూ వినోదాలు,ఇవన్నీ పైపై మెరుగులు. అవి మా జీవితాలలోని వెలితిని తీర్చలేవని గ్రహించాము. దేవుడు మాత్రమే జీవితాలలోని శూన్యాన్ని నింపగలడని, ఆయన మాకు చూపించాడు.

**లిజియా:** దేవుడు మమ్మల్ని పైపై మెరుగుల ప్రపంచం నుండి రక్షించాడు. ఇప్పుడు, మేము దేవునియందు స్వభావాలను మార్చగలిగే ప్రేమను కనుగొన్నా ము. అట్టి ప్రేమను ఇతరులు కూడా కనుగొనడంలో మేము సహాయం చేస్తూ, ఆయన కోసం పనిచేయడానికి మా జీవితాలను అంకితం చేసుకున్నాము.

**ఆల్బర్ట్:** ఈ రోజు, దేవుడు మాకంటే ముందుగా నడుస్తూ మాకు మార్గనిర్దేశం చేస్తున్నాడనే నమ్మకంతో మేము కలిసి నడుస్తున్నాము. మాలాగే జీవితం యొక్క అర్థం కోసం అన్వేషిస్తున్న ప్రజలతో ఈ సందేశాన్ని పంచుకోవడమే మా లక్ష్యం.

**లిజియా:** లోకం నుండి, నేరుగా దేవుని చేతుల్లోకి. అదే మా కథ:

**వ్యాఖ్యాత:** ఈ రోజు, ఆల్బర్ట్ స్పెయిన్లోని సగుంటో ఎడ్వెంటిస్ట్ కళాశాలలో విశ్వాసం మరియు విజ్ఞానశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నాడు, తద్వారా అతను మరియు లిజియా ప్రజలతో దేవుని గురించి మరింత ప్రభావవంతంగా పంచుకోగలరు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెవెంత్-డే ఎడ్వెంటిస్టులు ఆల్బర్ట్ చదువును సాధ్యం చేయడానికి సహాయపడ్డారు. పదమూడవ సబ్బాతు కానుకలను క్వార్టర్లీ మిషన్ ప్రాజెక్ట్ కానుక అని కూడా పిలుస్తారు. గత 13 వ సబ్బాతు కానుకలలో కొంత భాగం, ఆల్బర్ట్ చదువుతున్న థియాలజి (వేదాంతశాస్త్ర) విభాగాన్ని విస్తరించడానికి సహాయపడింది.

ఈ త్రిమాసం లో మీరు సమర్పించిన కానుకలకై కృతజ్ఞతలు.

ఇది స్పెయిన్‌తో సహా ఇంటర్-యూరోపియన్ డివిజన్‌లోని ప్రధానంగా లౌకిక దేశాలలో సువార్తను వ్యాప్తి చేసే మరిన్ని ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుంది.